క్లుప్తంగా

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

నారాయణపేట: నారాయణపేట నియోజకవర్గంలోని రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దని, సరిపడా యూరియా అందుబాటులోకి వస్తుందని మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది వానాకాలంలో 4039 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ కాగా, ఈ ఏడాది 5 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వరి సాగు పెరగడంతో దానికి తగ్గట్టుగానే యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో స్థానిక ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణికా రెడ్డి మాట్లాడి నారాయణపేట రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరినట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, డైరెక్టర్లు శరణప్ప, బాలరాజ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



మక్తల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీపీఓలుగా గుర్తించడంతో సోమవారం మక్తల్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వినోద్‌కుమార్, నర్సింహులు, అంజప్ప, సిద్రాంరెడ్డి, చక్రపాణి, సుధాకర్‌రెడ్డి, స్వాతి, సునీత, నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నిశాఖల అధికారులకు సన్మానం

మక్తల్: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా నిర్వహించడంతో సోమవారం మక్తల్‌లో ఎంపీడీఓ కార్యాలయంలో పోలీస్‌శాఖ, మున్సిపల్ కార్మికులు, విద్యుత్ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లను మంత్రి వాకిటి శ్రీహరి శాలువాతో వారిని ఘనంగా సన్మానించారు. ఉత్సవాల్లో అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగించడంతో అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఊట్కూరు: మండలంలోని ముగ్దుంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. విద్యార్థులు నామినేషన్‌లు వేయడం, ఓటరు జాబితా, ఓటుహక్కు వినియోగించుకోవడం, ఓట్లు లెక్కించడం తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నామినేషన్ వేసిన అనంతరం విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మాక్ పోలింగ్‌లో భూమిక, శివశంకర్‌లు అభ్యర్థులు గా పోటీ చేయగా, ఓట్ల లెక్కింపులో శివశంకర్‌కు అత్యధికంగా ఓట్లు పోలై విజేతగా ప్రకటించారు. మాక్ పోలింగ్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరాజు, ఉపాధ్యాయులు మహేష్, నర్మద, శ్రీదేవి పాల్గొన్నారు.

బొడ్రాళ్లకు బోనాలు

మద్దూరు: మద్దూరు పట్టణంలోని బొడ్రాలు ప్రతిష్ఠించి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం (మారుఏడ) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రతిష్ఠించిన బొడ్రాలకు పూజారులు రాఘవేంద్ర చారి, బీమాచారిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా కాలనీలోని ప్రజలు బోనమెత్తారు.

56వ రోజుకు రిలే దీక్షలు



నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 56వ రోజుకు చేరాయి. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ దగ్గర చేపట్టిన రిలే దీక్షలను భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు జి.వెంకట్ రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మశ్చందర్‌లు ప్రారంభించి మాట్లాడారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఎకరాకు రూ.35 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షలో కానుకుర్తి గ్రామ భూ నిర్వాసితులు కార్యదర్శి మొగులప్ప, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, అధ్యక్షుడు పింజారి మహ్మద్‌గౌస్, కోశాధికారి దానప్ప, మంజునాథ్ యాదవ్ రైతులు కూర్చున్నారు.

ఎన్నాళ్లీ వేతన కష్టాలు?

- 68 ప్రభుత్వ పాఠశాలు, 6016 మంది విద్యార్థులు
- 2008 నుంచి కట్టెలపొయ్యి పైనే వంటలు
- 5 నెలలుగా కమీషన్ రాలేదు
- చాలీచాలని కమీషన్‌తో వంటకార్మికులు



బలుబద్రాయపల్లిలో ఆరుబయట వంట చేస్తున్న కార్మికులు

కోస్గి రూరల్: ఉమ్మడి కోస్గి మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కోస్గి మండలంలో 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 33, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 8, కేజీబీవీలో 4,156 మంది విద్యార్థులు, గుండుమాల్ మండలంలో 24 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలలు 18 , ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 3, ఆదర్శ పాఠశాలలో 1860 మంది విద్యార్థులు చదువుతున్నారు.

2008లో ప్రారంభం..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. స్వశక్తి సంఘాల్లోని మహిళలు వంట చేసి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు 17 ఏళ్లగా మహిళలు చాలీచాలని వేతనంతో కాలం వెల్లదీస్తూ విద్యార్థులకు వంట చేస్తున్నారు.

17 ఏళ్లగా కట్టెల పొయ్యే దిక్కు..

ప్రభుత్వ పాఠశాలల్లో 17 ఏళ్లగా మధ్యాహ్న భోజన కార్మికులు కట్టెల పొయ్యి మీదే వంట చేస్తున్నారు. రేకుల షెడ్లలోనే మహిళలు వంట చేస్తున్నారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతుంటారు. కట్టెల పొగ వల్ల కొందరు వంట కార్మికులకు కళ్లు కనిపించని పరిస్థితి ఉంది. కట్టెల కొనుగోలుకు ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదు.

పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలంటే ప్రతి రోజు నిత్యవసర సరుకులు, కూరగాయలు కొనుగోలు చేయాల్సిందే. కానీ వాటి ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు ఇచ్చే కమీషన్ డబ్బులు పెరగకపోవడంతో వంటవారు అప్పులో కూరుకుపోతున్నారు.

- నూనె పాకెట్ ధర రూ.155
- కిలో పెసరపప్పు రూ.120
- కిలో కందిపప్పు రూ.75
- కిలో టమాట ధర రూ.40

ఇలా నిత్యవసర సరుకుల ధరలు పైపైకి పోవడంతో, వచ్చే కమీషన్‌తో చేసిన అప్పులు తీర్చలేక కుటుంబ పోషణ భారంగా మారింది.

పెరగని కమీషన్..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే కమీషన్ నామా మాత్రంగా పెంచడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెనూ ప్రకారం కార్మికులు విద్యార్థులకు సరైన భోజనం పెడుతున్నా, కమీషన్ పెంచకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటున్నారు.

- 1–5 తరగతి విద్యార్థులకు భోజనం పెట్టినందుకు రూ.6.78
- 6–8 తరగతి విద్యార్థులకు రూ.10.17
- 9–10 తరగతి విద్యార్థులకు రూ.13.17

ప్రభుత్వం చెల్లిస్తుంది.

142 మంది కార్మికులు..

ఉమ్మడి కోస్గి మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 68 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 142 మంది మహిళా కార్మికులు వంట చేస్తున్నారు. వారికి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేలు కనీస వేతనాలు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5 నెలలుగా వేతనాలు రాలేదు.

విడుదల కాని కమీషన్..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం ఇంకా చెల్లించలేదు. 1–8 తరగతులకు మధ్యాహ్న భోజన బిల్లు రూ.7లక్షలు, 9–10 తరగతి విద్యార్థులకు 5 నెలలకు రూ.17.50 లక్షలు, 8 నెలలుగా గుడ్లకు రూ.24లక్షలు కార్మికులకు రావాల్సి ఉంది.

అప్పులు చేస్తున్నాం..



5 ఏళ్లగా వంట చేస్తున్నాను. సకాలంలో ప్రభుత్వం నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రాక పోవడంతో అప్పులు చేస్తున్నాం. వంటకోసం సిలిండర్లు వస్తా యని నెల క్రితం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెప్పారు. ఇప్పటి వరకు రాలేదు. వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషన భారంగా మారింది.

– రాజెళ్లి అంజిలమ్మ, వంట కార్మికురాలు, కోస్గి

నిధులు రాగానే చెల్లిస్తాం..



5 నెలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతున్నాం. బిల్లులు ప్రభుత్వం నుంచి రాగానే చెల్లిస్తాం.

– శంకర్‌నాయక్, ఎంఈఓ, కోస్గి

సుపరిపాలనతో చేరువైన ప్రభుత్వం



నర్వ లోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మంత్రి డా.వాకిటి శ్రీహరి

నర్వ: సంక్షేమం, సుపరిపాలనతో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేరువైందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి 100 మంది బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉందేకోడ్, నాగిరెడ్డిపల్లి, జంగంరెడ్డిపల్లి గ్రామాల ఆయా పార్టీల నాయకులకు మంత్రి కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందుతాయన్నారు. గ్రామ గ్రామానా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, జగదభిరామ్‌రెడ్డి, పోలీస్ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, రాయికోడ్ ఆనంద్, అశోక్‌గౌడ్, ఉమాపతి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సుతో చైతన్యం



కొల్లంపల్లిలో మాట్లాడుతున్న నాగేశ్వరి

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను చైతన్యం చేయడానికి న్యాయ విజ్ఞాన సదస్సు ఎంతో ఉపకరిస్తుందని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి అన్నారు. నారాయణపేట, ధన్వాడ మండలాల్లో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లంపల్లి, మండిపల్లి గ్రామాల్లో వారు పాల్గొని మాట్లాడారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందని, ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తాయని, అన్ని రకాల సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతకి సమాన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రజలు చైతన్యంగా ఉంటేనే అన్ని హక్కులు సాధ్యమవుతాయని తెలిపారు. పేదలకు ఉచిత న్యాయాన్ని ప్రజల వద్దకు పొందవచ్చన్నారు. బాల్య వివాహాలు, వరకట్న నిషేధం, బాలకార్మిక వ్యవస్థ, నిరక్షరాస్యత తదితర అంశాలపై వివరించారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజ్ కుమార్, అంజమ్మ, జ్యోతి, పారా లీగల్ వలంటీర్ రూపిక, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భావితరాలకు మార్గదర్శకులు



నారాయణపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

నారాయణపేట రూరల్: భావితరాలకు మార్గదర్శకులుగా ఉంటూ విద్యార్థుల్లో జ్ఞానజ్యోతులను వెలిగించి దేశానికి ఉపయోగపడే ప్రయోజకులుగా తీర్చిదిద్దే ఘనత ఉపాధ్యాయులదని ఆర్డీఓ మేఘగాంధీ, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, టౌన్ ఎస్ఐ–2 గాయత్రి అన్నారు. పట్టణంలోని లయన్ భవన్‌లో సోమవారం లయన్స్‌క్లబ్ అఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో జిల్లాలోని 50 మంది మహిళా ఉపాధ్యాయులను పూలమాల, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు.

కోస్గి రూరల్: ఉత్తమ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ, కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంఈఓ కృష్ణారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సత్యనారాయణ, అన్నపూర్ణ, సురేష్, మహిపాల్, రాములు, నాగేందర్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: అన్ని ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఈఓ బాలాజీ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు అనురాధ, సునీత, దత్తురావు, కార్యాలయం సిబ్బంది నారాయణ, కరిష్మ, సూరి, ఆరీఫ్, రవిప్రకాష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'ఆత్మీయ భరోసా' అమలులో విఫలం

నారాయణపేట: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎ.సలీం, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకం కింద రూ. 12వేలు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి జిల్లాలో 8,189 మందిని అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం.. 4,746 మందిని వివిధ కారణాలతో తొలగించారని తెలిపారు. మిగతా 3,445 మందిని అర్హులుగా గుర్తించి.. రూ. 6వేల చొప్పున మాత్రమే చెల్లించారన్నారు. రెండో దఫా చెల్లింపుల ఊసే లేదన్నారు. వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, చెన్నప్ప, వై.రాజు, సాయిలు, వెంకటయ్య, నర్సింహులు, రామాంజనేయులు, ఖతార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బహుమతులు అందిస్తున్న అధికారులు

కోస్గి రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. అండర్–14 బాలికలు విభాగంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10 జట్లు పాల్గొనగా, ప్రథమ బహుమతి ముశ్రీఫా ఉన్నత పాఠశాల, బాలుర విభాగంలో 10 జట్లు పాల్గొనగా, ప్రథమ బహుమతి మీర్జాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అండర్–17 బాలికల విభాగంలో 11 జట్లు పాల్గొనగా ప్రథమ బహుమతి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, బాలుర విభాగంలో వేదా ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల విద్యాధికారి శంకర్‌నాయక్, కృష్ణగౌడ్, పీఈటీలు నరసింహ, రాజు, రాధిక, పుష్పలత, మల్లేష్ తదితరులు ఉన్నారు.

మొరం తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డి గ్రామ శివారులోని అసైన్‌మెంట్ భూముల నుంచి మొరం తరలింపును గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు మాట్లాడుతూ మొరం తరలించేందుకు భారీ వాహనాలు గ్రామానికి వేసిన బీటీ రోడ్డుపై వెళ్తుండడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, ఈ విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై తాము వాహనాలను అడ్డుకోవడంతో ప్రస్తుతం నిలిచిపోయిందని, ఈ విషయంపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీలో ఓటర్లను తొలగించాలి



మాగనూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణారావు

మద్దూరు: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వారు మండలంలోని గ్రామ పంచాయతీల్లో కూడా ఓటర్లను నమోదు చేసుకున్నారని, వారికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు రాజకీయ నాయకులు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓటరు లిస్టుపై అఖిల పక్ష నాయకులు సమావేశం ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అభ్యంతరాల స్వీకరణ సమావేశం నిర్వహించారు. మద్దూరు మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఓటర్ల సంఖ్యను, ఎంపీటీసీ స్థానాల పరిధిలోని గ్రామాలు, ఓట్ల సంఖ్యను ఎంపీడీఓ వివరించారు. డబుల్ ఓట్ల విషయాన్ని తహసీల్దార్‌కు లేఖ వ్రాస్తానని అయన పేర్కొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణారావు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెన్నప్ప, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బసప్ప, ప్రసాద్‌గౌడ్, కిష్టప్ప, పలు పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాగనూర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నిలు–2025 ముసాయిదా ఓటరు జాబితాపై ఎంపీడీఓ శ్రీనివాసులు తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు.

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు జాబితాపై అఖిలపక్ష నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

హాస్టల్ విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

ఊట్కూరు: తల్లిదండ్రులు హాస్టల్‌లో ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించాలని వార్డెన్ వెంకటేష్ కోరారు. సోమవారం ఊట్కూరులోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నోట్‌బుక్స్, 4 జతల దుస్తులు, దుప్పట్లు, పెట్టెలు ఇచ్చినట్లు తెలిపారు. నాణ్యమైన భోజనంలో పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు గైర్హాజర్ కాకుండా చూడాలని ఆయన కోరారు. ఉదయం సాయంత్రం వేళలో హాస్టల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వేతనాలు అందించాలి

నారాయణపేట రూరల్: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే అందించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఈ విద్యా సంవత్సరంలో వేతనాలు చెల్లించలేదు. దీంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా మారిందని, ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు, ప్రతినెల 5న జీతాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు.

దివ్యాంగులు వ్యాపారాల్లో ఎదగాలి



కోస్గి: వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు కృషి చేయాలని ఎన్యూబెల్ ఇండియా డైరెక్టర్ సిజియో అన్నారు. సోమవారం పట్టణంలోని కమిట్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18–35 ఏళ్ల లోపు వికలాంగులు సమయాన్ని వృథా చేయకుండా కలిసికట్టుగా రోజువారి ఆదాయం వచ్చే వ్యాపారాలు చేపట్టాలన్నారు. కేవలం ఫించన్, కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా స్వశక్తితో పల్లీలు, సమోసా, పాప్‌కార్న్, చెట్నీలు, పూలు, పండ్లు వంటి వ్యాపారాలు చేపట్టాలన్నారు. ఇలాంటివి ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జున్, వికలాంగుల సంఘం అధ్యక్షుడు అనురాధ, భీమమ్మ, వెంకటయ్య, రాములు, నారాయణమ్మ, దస్తప్ప తదితరులు ఉన్నారు.

ఐలమ్మ వర్ధంతి ప్రతి గ్రామంలో నిర్వహించాలి

ధన్వాడ: భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని ఈ నెల 10న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రజక కులస్తులు ఐలమ్మ వర్ధంతిని గ్రామాలలో ఘనంగా నిర్వహించి ఐలమ్మ చరిత్ర ప్రజలకు వివరించాలని కోరారు. ఇందులో పట్టెల్ నర్సింహులు, గంజి బట్టల బాలయ్య, తదితరులు ఉన్నారు.

డీజే సౌండ్‌తో మహిళకు అస్వస్థత

మక్తల్: గణేశ్ వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 12 గంటలకు మక్తల్‌కు చెందిన సుజాత (38) పాత టాకీస్ దగ్గర డీజే సౌండ్ వల్ల కింద పడి స్పృహ తప్పింది. అక్కడ తాత్కాలిక చికిత్స చేసినా ఫలితం లేక పోవడంతో 108లో ఆమెను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో జిల్లా కేంద్రానికి తరలించారు.

పంటల సాగుపై అవగాహన

మక్తల్: మండలంలోని చందపూర్, తిరుమలాపూర్, దాసర్‌దొడ్డి గ్రామాల్లో సోమవారం రైతులు సాగు చేసిన వారికి పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు సైదయ్య, ఈశ్వర్‌రెడ్డి, ఏఈఓలు యోగేశ్వర్‌రెడ్డి, విజయ్‌లు అవగాహన కల్పించారు. సాగు చేసిన పంటలు కంది, పత్తి పంటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ప్రతి గ్రామాన్ని సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



నారాయణపేట: ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మత పెద్దల బోధనలు, ప్రత్యేక ప్రార్థన చేశారు. ఎక్కడక్కడ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిలాల్ మజీద్ నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ముహమ్మద్ ప్రవక్త విశిష్టతను వివరించారు. ర్యాలీలో నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జ్యూస్, వాటర్ బాటిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, మార్కెట్ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, ముస్లిం మత పెద్దలు అడ్వకేట్ సలీం, అమీరుద్దీన్, నవాజ్‌ముసా, నాయకులు పాల్గొన్నారు.


పండగలు శాంతికి ప్రతీకలు

నారాయణపేట క్రైం: పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో మేయిన్ చౌక్ దగ్గర ఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొని ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని అన్నారు. ర్యాలీలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐ శివశంకర్, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

బోధనలో టీఎల్ఎంను ఉపయోగించాలి

కృష్ణా: ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీఎల్ఎం ద్వారా విద్యార్థులకు బోధించాలని కాంప్లెక్స్ హెచ్ఎం గణేశ్‌సింగ్ సూచించారు. సోమవారం మండలంలోని మురహర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశాడు. ప్రతిరోజు యాక్షన్‌ప్లాన్ అమలు చేయాలని, అదే విధంగా టీచింగ్ డైరీని ప్రతి ఉపాధ్యాయుడు రాయాలని, విద్యార్థులకు హోంవర్క్, మార్కుల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈరన్న, ఉపాధ్యాయులు అజయ్, తదితరులు ఉన్నారు.

జన హితమే మోదీ అభిమతం



నారాయణపేట రూరల్: దేశ ప్రజల హితమే ప్రధాని నరేంద్రమోదీ అభిమతమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కెంచె శ్రీనివాసులు అన్నారు. అభివృద్ధి భారత్ కోసం జీఎస్టీ స్లాబులు తగ్గించి ప్రధాని సామాన్యులకు దీపావళి కానుక ముందుగానే అందించారన్నారు. కోటకొండ బస్టాండ్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొంగరి రాములు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాక ప్రవీణ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం నిత్యవసరాలపై జీఎస్టీ కుదింపుపై బీజేపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, గోపాల్‌రావ్, అంజిలప్ప ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

నారాయణపేట	జి. వెంకటేష్ గౌడ్	- 96666 52077
మక్తల్	మహేష్	- 83099 46853
కోస్గి	కె. రమేష్	- 99486 98552

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

సయ్యద్ జావిద్ అలి : 90109 62007